ఆంధ్రజ్యోతి తమిళనాడు
6 మంగళవారం 5 జనవరి 2021

# యుద్ధప్రాతిపదికన కరోనా నిరోధక టీకాలు

## కేంద్ర మంత్రి హర్షవర్ధన్



పట్టాలను ప్రదానం చేస్తున్న ఛాన్సలర్ వీఆర్ వెంకటాచలం

చెన్నై, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా యుద్ధప్రాతి పదికన కరోనా నిరోధక టీకాలు వేసే కార్యక్ర మాలను కేంద్ర ప్రభుత్వం చేపడుతోందని ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ తెలిపారు. సోమవారం జరిగిన శ్రీరామచంద్రా ఉన్నతవిద్యా పరిశోధనా సంస్థ స్నాతకోత్సవంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రసంగం చేస్తూ కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు ప్రధాని నరేంద్రమోదీ తరచూ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చలు జరిపి తగు చర్యలు చేపట్టారని చెప్పారు. కోవిడ్ సంక్షోభ సమయంలో వైరస్‌బాధితులకు, సాధారణ రోగాలకు గురైనవారికి చికిత్సలందించే నిమిత్తం 'ఈ సంజీవని' పేరుతో 23 రాష్ట్రాలలో టెలిమెడిసిన్ సదుపాయాలను విస్తరింపజేశా మన్నారు. అంతే కాకుండా ఆయుష్మాన్ భారత్ కింద భీమా పథకాన్ని విస్తృతపరచి 10.74 కోట్ల మంది నిరుపేదలకు ఆరోగ్య భీమా సదుపాయం కల్పించినట్టు మంత్రి చెప్పారు. ఇక ప్రపంచ ఆరోగ్య సంస్థ నియమావళి మేరకు డాక్టర్లు రోగుల నిష్పత్తిని 1:1700ల నుంచి 1:1000కి పెంచినట్టు ఆయన తెలిపారు. మోదీ రెండోసారి ప్రధానిగా అధికారంలోకి రాగానే 75 జిల్లా స్థాయి ఆస్పత్రులను వైద్య కళాశాలల ఆస్పత్రులుగా స్థాయిని పెంచారని ఆయన వివరించారు. శ్రీరామచంద్రా ఉన్నతవిద్యా పరిశోధనా సంస్థ కోవిడ్ రోగులకు చికిత్సలందించేందుకు ప్రత్యేక బ్లాక్‌ను, ఐసీఎంఆర్ వ్యాక్సిన్ ట్రయల్స్ కోసం టెస్టింగ్ సెంటర్‌ను నిర్వహిస్తుండటం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. ఈ స్నాతకోత్సవంలో ఛాన్సలర్ వీఆర్ వెంకటాచలం అత్యంత ప్రతిభకనబరచిన 94 మంది విద్యార్థులకు స్వర్ణ పతకాలు, ఇతర విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ప్రోఛాన్సలర్ ఆర్వీ సెంగుటువన్, వైస్‌ఛాన్సలర్ డాక్టర్ పీవీ విజయరాఘవన్, డీన్‌లు డాక్టర్ ఎస్పీ త్యాగరాజన్, డాక్టర్ మహేష్ మాకమూడి, రిజిస్ట్రార్ వి. సామినాథన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ జ్యోతిమలర్ తదితరులు పాల్గొన్నారు.